క్లుప్తంగా

విద్యార్థులకు కళ్లజోళ్ల పంపిణీ



విద్యార్థులకు కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న ఎంఈఓ

పెద్దదోర్నాల: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు కళ్లజోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈఓ మస్తాన్‌నాయక్ మాట్లాడుతూ విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించిన కంటి వైద్యురాలు కవిత పాఠశాలలోని 86 మందిని గుర్తించి వారికి కళ్లజోళ్లను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు అనసూయదేవి, ఉపాధ్యాయురాలు కిరణ్ కుమార్‌కోలా, వెంకటశివ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఉత్పత్తులను ప్రోత్సహించాలి



సేంద్రియ ఉత్పత్తుల గురించి వివరిస్తున్న ప్రభాకర్

ముండ్లమూరు (దర్శి): ప్రతిఒక్కరూ సేంద్రియ ఉత్పత్తులను ప్రోత్సహించాలని మండల ప్రకృతి వ్యవసాయ అధికారి ఎంటీ ప్రభాకర్ సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద సోమవారం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులైన కూరగాయలు, ఆకుకూరల స్టాళ్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం చేయాలని సూచించారు. వారిని మోటివేషన్ చేయడంలో భాగంగా స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్యకరమైన ఉత్పత్తులు అందించాలని రైతులకు సూచించారు. సేంద్రియ ఎరువులతో భూమి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు.

బెల్ట్ షాపుపై కేసు నమోదు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాసరావు

కురిచేడు: మండలంలోని బోధనంపాడు గ్రామంలో బెల్ట్ షాపునకు వేలం పాట నిర్వహించినట్లు సమాచారం అందడంతో ఆదివారం తనిఖీ చేయగా, 9 మద్యం బాటిళ్లు లభించినట్లు ఎక్సైజ్ సీఐ కే శ్రీనివాసరావు తెలిపారు. మద్యం విక్రయాలు జరుపుతున్న కంకణంపాటి ఆంజనేయులుపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఎవరైనా గ్రామంలో అక్రమంగా మద్యం అమ్మితే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. గత ఐదు నెలల నుంచి బెల్ట్ షాపులపై దాడి చేసి 810 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని 69 మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై వీఆర్ సత్యనారాయణ, సిబ్బంది ఖాసింపీరా, నాగరాజు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

అర్హులైన ఎస్టీలకు న్యాయం చేస్తాం



విచారిస్తున్న ఒంగోలు ఆర్డీఓ లక్ష్మీప్రసన్న

తాళ్లూరు: గిరిజనులు సాగుచేసుకుంటున్న భూములను పరిశీలించి అర్హులైన వారికి న్యాయం చేస్తామని ఒంగోలు ఆర్డీఓ లక్ష్మీప్రసన్న తెలిపారు. తాళ్లూరు మండలంలోని ఏకలవ్యనగర్‌ను సోమవారం ఆమె సందర్శించారు. ఏకలవ్యనగర్ వాసులు సోమవరప్పాడు సర్వే నంబర్ 370 నుంచి 405 వరకు ఉన్న వ్యవసాయ భూమిని మూడు దశాబ్దాలుగా సాగుచేసుకుంటున్నారు. అటవీ హక్కుల చట్టం ప్రకారం తమకు పట్టాలు మంజూరు చేయాలని అనేక పర్యాయాలు ప్రభుత్వాలు, అధికారులకు విన్నవించారు. ట్రైబర్ రైట్స్ ఫోరం చైర్మన్ ఇట్టా బాబూరావు కూడా హైకోర్టును ఆశ్రయించగా, వారిని న్యాయం చెయ్యాలని రెవెన్యూ అధికారులను కోర్టు ఆదేశించింది. అయినప్పటికీ ఫైల్ ముందుకు కదలకపోవడంతో మరోసారి కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. ఎట్టకేలకు కోర్టు ఆదేశాల మేరకు అధికార యంత్రాంగం ముందుకు కదిలింది. ఈ నేపథ్యంలో ఒంగోలు ఆర్డీఓ లక్ష్మీప్రసన్న ట్రైబర్ రైట్స్ ఫోరం చైర్మన్‌తో మాట్లాడారు. నిజమైన అర్హులకు తగిన న్యాయం చేస్తామని తెలిపారు. అందుకు సంబంధించిన వివరాలు సేకరించారు. ఏకలవ్యనగర్‌లో ఉన్న వారి పూర్తి పరిస్థితిని, పూర్వ రెవెన్యూ అధికారుల నివేదికలను పరిశీలించారు. అనంతరం ఏకలవ్యనగర్‌ను సందర్శించారు. తహసీల్దార్ సంజీవరావు, డిప్యూటీ తహసీల్దార్ ఇమ్మానియేల్ తదితరులు పాల్గొన్నారు.

కరువు ప్రకోపం.. రైతుకు శాపం

- కురిచేడు, దొనకొండ మండలాల్లో గుక్కెడు నీళ్లు కరువు
- అన్నదాతకు వ్యవసాయం బరువు
- ఆత్మహత్యలే శరణ్యమంటూ ఆవేదన



దొనకొండ మండలం రామాపురంలో అడుగంటిన బోర్లు



ఎండిన నిమ్మచెట్టు వద్ద రైతు సుబ్బారెడ్డి

కురిచేడు: మండలంలో కరువు విలయతాండవం చేస్తోంది. బోర్లన్నీ ఎండిపోవడంతో తాగేందుకు గుక్కెడు నీళ్లు కూడా కరువయ్యాయి. తీవ్ర వర్షాభావంతో చెరువులు, బోర్లు అడుగంటాయి. గ్రామాల్లో గంటల తరబడి వేచి ఉంటేగానీ బిందెడు నీరు దొరికే పరిస్థితి లేదు. పంట పొలాల్లోని బోర్ల పరిస్థితి మరీ దారుణం. నాగార్జునసాగర్ కాలువ ఆనుకుని ఉన్న గ్రామాల్లో బోర్లు కొంత మేర రీచార్జి అయి నీరందుతుంది. కానీ, అంతకన్నా దూరం ఉన్న పొట్లపాడు, గంగదొనకొండ, పడమర గంగవరం, ఎస్‌ఎస్‌పీ అగ్రహారం, పెద్దవరం గ్రామాల్లో పరిస్థితి పూర్తి ఇబ్బందికరంగా ఉంది. గంగాభవాని అమ్మవారు వేంచేసి ఉన్న గంగదొనకొండలోనూ గంగకు కరువొచ్చి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాపునకు వచ్చిన తోటలు, పండ్ల చెట్లు నిలువునా ఎండిపోతున్నాయి. రూ.లక్షలు పెట్టుబడి పెట్టి ఆరుగాలం పండించిన పంట చేతికొచ్చే సమయానికి నిలువునా ఎండిపోతుండటంతో రైతులు ఆత్మహత్యలే శరణ్యమని వాపోతున్నారు.



బోరు నుంచి సన్నగా వస్తున్న నీరు

దొనకొండ మండలంలో...

మండలంలో ఈ ఏడాది తక్కువ వర్షపాతం నమోదు కావడంతో చెరువుల్లో చుక్క నీరు లేక చిల్లచెట్లతో దర్శనమిస్తున్నాయి. పంటలను కాపాడుకునేందుకు రైతులు బోర్లు వేస్తున్నా నీరు పడటం లేదు. దీంతో పంటలకు నీటితడులు లేక దిగుబడులపై ప్రభావం చూపింది. గత ఏడాది మిర్చి సాగుచేస్తే క్వింటాకు 30 క్వింటాళ్ల దిగుబడి రాగా, ఈ ఏడాది 10 క్వింటాలు కూడా రాలేదు. ఖరీఫ్‌లో 17,500 ఎకరాల్లో వివిధ పంటలు సాగుచేయాల్సి ఉండగా, కేవలం 14 వేల ఎకరాల్లో మాత్రమే సాగుచేశారు. రబీలో సైతం 9 వేల ఎకరాల్లో పొగాకు, మిరప సాగుచేయాల్సి ఉండగా, 6 వేల ఎకరాల్లో మాత్రమే సాగుచేశారు. అరకొరగా సాగుచేసిన పంటలకు నీరందక తెగుళ్లు చుట్టుముట్టి దిగుబడులు గణనీయంగా పడిపోయాయి. మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్లు వచ్చిన అరకొర దిగుబడులకు ధరలు లేకపోవడంతో రైతులు భారీగా నష్టాలు మూటగట్టుకోవాల్సిన పరిస్థితి. చెరువులు, కుంటల్లో నీరు లేకపోవడంతో పశుపోషకులు జీవాలకు ఏ విధంగా నీరందించాలో తెలియక తల్లడిల్లుతున్నారు. ఇక మే, జూన్ నెలల్లో అయితే నీటి ఇబ్బందికి ఏం చేయాలో అని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

పంటను వదిలేశాను



ఈ ఏడాది 2 ఎకరాల్లో మిరప సాగు చేశా. నీరు లేక పంటను వదిలేశాను. 4 ఎకరాల్లో పొగాకు వేశా. వర్షాలు లేక పంట దిగుబడి రాలేదు. సుమారు రూ.5 లక్షలు ఖర్చు చేశా. గతేడాది సమృద్ధిగా పంటలు పండాయి. గిట్టుబాటు ధర లభించింది. ఈ ఏడాది పండించిన పంటకు ఏమాత్రం గిట్టుబాటు ధర లభించలేదు. భారీగా నష్టాలే మిగిలాయి.

వెన్నపూస చెంచిరెడ్డి, ఇండ్లచెరువు

తోటకాడికి వెళ్లాలంటే ఏడుపొస్తోంది:



తోటలోని చెట్లను చిన్న పిల్లలను కాపాడినట్లు కాపాడుకుంటూ వచ్చా. చేతికొచ్చే సమయంలో చెట్లు నిలువునా ఎండిపోతుండటంతో ఏం చేయాలో పాలు పోవడం లేదు. తోటలో ఎండిపోతున్న చెట్లను చూస్తే ఏడుపు వస్తోంది. పెట్టిన పెట్టుబడి, చేసిన కష్టం వృథా అవుతోంది. ప్రభుత్వం ఆదుకోకుంటే రైతుల మనుగడ కష్టం.

కందె గంగయ్య, రైతు, గంగదొనకొండ


పశువులకు గుక్కెడు నీరు కరువు:



ఒక వైపు మిరప పంటలు నీరులేక ఎండిపోయాయి. వాటిని రైతులు వదిలేశారు. నిమ్మతోటలు నిలువునా ఎండిపోతున్నాయి. మూగజీవాలు గొంతు తడుపుకోను గుక్కెడు నీరు లేక విలవిల్లాడుతున్నాయి. ఇటు పంటలు, అటు మూగజీవాలను కాపాడుకోవటం కష్టతరంగా మారింది. నీరు సరఫరా చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

లక్కిరెడ్డి సుబ్బారెడ్డి, రైతు, గంగదొనకొండ

దిగజారిన బర్లీ పొగాకు ధరలు



పాకలో ఎండబెట్టిన బర్లీ పొగాకు



తేమ శాతం కారణంగా తిరిగి ఇళ్లకు చేరిన పొగాకు బేళ్లు

- ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు

దొనకొండ: బర్లీ పొగాకు ధరలు రోజురోజుకూ దిగజారిపోతున్నాయి. గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు దిగాలుపడుతున్నారు. అధిక పెట్టుబడులు పెట్టి మరీ బర్లీ పొగాకును రైతులు సాగు చేయగా, ప్రకృతి వైపరీత్యాలు, వాతావరణ పరిస్థితుల్లో మార్పుల కారణంగా దిగుబడి కూడా అంతంతమాత్రంగానే వచ్చింది. దొనకొండ మండలంలోని గంగదేవిపల్లి, యర్రబాలెం, ఆరవల్లిపాడు, తెల్లబాడు, ఇండ్లచెరువు, సంగాపురం, వద్దిపాడు, వెంకటాపురం, పోలేపల్లి, తదితర గ్రామాల్లో సుమారు 700 ఎకరాల్లో బర్లీ పొగాకు సాగుచేశారు. గతేడాది రూ.15 వేల నుంచి రూ.18 వేల వరకూ ధర పలకడంతో ఈ ఏడాది ఎంతో ఆశగా రైతులు బర్లీ పొగాకు పండించారు. కానీ, రోజురోజుకూ ధరలు తగ్గిపోతుండటంతో అయోమయానికి గురవుతున్నారు. రూ.11 వేల నుంచి రూ.12 వేలకు ధర పడిపోయిందని చెబుతున్నారు.

ఎకరాకు రూ.70 వేల నుంచి రూ.80 వేల వరకూ ఖర్చు...

ఎకరాకు సుమారు ట్రాక్టర్, నారు, కూలీల ఖర్చులు కలిపి రూ.70 వేల నుంచి రూ.80 వేల వరకు ఖర్చయిందని రైతులు చెబుతున్నారు. పండించిన పొగాకు చెక్కులను కంపెనీలకు తీసుకెళ్తే ఐటీసీ, జీపీఐ, ఎలైన్ కంపెనీల నిర్వాహకులు తేమ శాతం ఎక్కువగా ఉందని వెనక్కి పంపిస్తున్నారంటున్నారు. దీంతో రైతులు పొగాకు అమ్ముకోవడానికి నానా తంటాలు పడుతున్నారు. పొలాలు, ఇళ్ల వద్ద ఆకు ఎండబెట్టుకుని బేళ్లు కట్టి చిలకలూరిపేట, మేదరమెట్ల, ఒంగోలు ప్రాంతాల్లోని కంపెనీలకు తీసుకెళ్తున్నారు. అక్కడ వ్యాపార సంస్థలో పని చేస్తున్న బయ్యర్లు తేమ శాతం ఉంది, చెక్కులు వెనక్కి తీసుకెళ్లమని చెబుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కొక్క రైతు 10 నుంచి 15 చెక్కులు తీసుకెళ్తే.. వాటిలో తేమ శాతం ఉందంటున్నారని, రేటు రావడం లేదని రైతులు ఇళ్లకు తీసుకొస్తున్నారు. దీంతో ఈ ఏడాది కష్టాలు తప్పేలా లేవని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పొగాకు పంట కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

ఈ ఏడాది వ్యవసాయమే కలిసిరాలేదు



ఈ ఏడాది వ్యవసాయం కలిసిరాలేదు. రైతు పండించిన ఏ పంటకూ గిట్టుబాటు ధర లేదు. నేను 5 ఎకరాల్లో పొగాకు సాగు చేశా. ఖర్చులు అధికంగా ఉండటంతో మిగిలిందేమీ లేదు. గత 4 సంవత్సరాలు అన్ని పంటలకు అనుకూలంగా ధర పలికింది. పొగాకు ధర కూడా రూ.15 వేల నుంచి రూ.18 వేల వరకు పలికింది. ఆనందంగా అమ్ముకున్నాం. ఈ ఏడాది పరిస్థితి దారుణంగా ఉంది.

– తమ్మనేని అక్కిరెడ్డి, ఇండ్లచెరువు

ప్రమాదకరంగా స్పీడ్ బ్రేకర్లు



ఐనముక్కల వద్ద జీబ్రా గుర్తులు లేని స్పీడ్ బ్రేకరు

- జీబ్రా గుర్తులు లేకపోవటంతో ఇబ్బందులు
- గుర్తించలేక ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు

పెద్దదోర్నాల: మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఎటువంటి గుర్తులు లేని స్పీడ్ బ్రేకర్లతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో వాటిని గుర్తించలేక ప్రమాదాల బారిన పడి గాయాల పాలవుతున్నారు. మండల పరిధిలోని ఐనముక్కల, మొట్ల మల్లికార్జునపురం తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన స్పీడ్‌బ్రేకర్లపై సరైన గుర్తులు వేయకపోవటంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాహనాల్లో వేగంగా ప్రయాణించే సమయంలో ఒక్క సారిగా స్పీడ్ బ్రేకర్లను గుర్తించి బ్రేకులు వేయటంతో ప్రమాదాలకు గురవుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. ఒక్కోసారి వాటిని అధిగమించే సమయంలో ఇంజన్‌లు ఆగిపోవటంతో పాటు, మరి కొన్నిసార్లు వాహనాలు అదుపు తప్పి కింద పడిపోతున్నారు. ఇంత వరకు వేగంగా వెళ్లి ప్రమాదాల బారిన పడుతున్న వారిని చూశామని, అయితే స్పీడ్ బ్రేకర్లను దాడుతూ ప్రమాదాల బారిన పడుతున్న వారిని ఇప్పుడు చూస్తున్నామని వారు వాపోతున్నారు. మండల పరిధిలో స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేసిన అధికారులు కనీసం వాటికి జీబ్రా క్రాసింగ్ గుర్తులు ఏర్పాటు చేయకపోవటంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శ్రీశైలం పుణ్యక్షేత్రానికి తరలి వచ్చే యాత్రికులకు ఈ రహదారులు కొత్తవి కావటంతో ఆయా మార్గాల్లో ప్రయాణించే వారు స్పీడ్ బ్రేకర్ల వద్ద ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి స్పీడ్ బ్రేకర్లు ఉన్న చోట్ల జీబ్రా గుర్తులు వేసి ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పలువురు కోరుకుంటున్నారు.

స్పీడ్ బ్రేకర్లపై జీబ్రా గుర్తులు వేయాలి

మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్ల వద్ద జీబ్రా గుర్తులు వేయించాలి. జీబ్రా గుర్తులు లేక పోవటంతో ఆయా ప్రాంతాల్లో ప్రమాదాలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి.

– షేక్ రహీం, వాహనదారుడు, పెద్దదోర్నాల

ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం



పెద్దదోర్నాల: అవగాహన కల్పిస్తున్న సూపరింటెండెంట్ వైద్య సంజీవ్



మాట్లాడుతున్న వైద్యాధికారి ప్రకాష్

దొనకొండ: స్థానిక రైల్వే వైద్యశాలలో వైద్యాధికారి మేశం ప్రకాష్ ఆధ్వర్యంలో రైల్వే పింఛనర్లు సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ రైల్వే పింఛనర్ల ఆరోగ్యం విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రైల్వే పింఛనర్ల కార్యదర్శి బి.జయరాజు మాట్లాడుతూ పింఛనర్లు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య సమస్యలకు పూర్తిగా రైల్వే ఆరోగ్య కేంద్రాన్ని ఉపయోగించుకోవాలన్నారు. అందుకోసం పింఛనర్లకు ఎఫ్ఎంఏ రూపంలో అందజేస్తున్న రూ.1000 రద్దు చేసుకుని అందరూ ఓపీడీ సౌకర్యంతో కూడిన వైద్యాన్ని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో పలువురు పింఛనర్లు పాల్గొన్నారు.

నోటి క్యాన్సర్‌పై అవగాహన

పెద్దదోర్నాల: వరల్డ్ హెల్త్ డే సందర్భంగా మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం నోటి క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ వైద్య సంజీవ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు నోటి క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలని కోరారు. పంటి డాక్టర్ కళాసంధ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నోటి శుభ్రత పాటించాలని కోరారు. పాన్ పరాగ్, మద్య పానానికి దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్‌లు మెర్సీ ప్రియాంక, ఆంజనేయులు, హెడ్ నర్స్ ఎలిజబెత్, ఆరోగ్య మిత్రలు చంద్రశేఖర్, ఫార్మాసిస్ట్ పిచ్చిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, ఆశావర్కర్లు తదితరులు పాల్గొని మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి



గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ముండ్లమూరు (దర్శి): గ్రామాల్లో ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ కే శ్రీనివాసులు సూచించారు. మండలంలోని ఉల్లగల్లు గ్రామంలో ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ కళాశాల బాపట్ల ఆధ్వర్యంలో జాతీయసేవా పథకం కార్యక్రమంలో భాగంగా కళాశాల విద్యార్థులతో సోమవారం ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామంలో పిచ్చి మొక్కలు పీకి శుభ్రం చేశారు. గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ ప్లాస్టిక్ పెనుభూతం వంటిదని, భూమిలో ప్లాస్టిక్ వ్యర్థాలు ఎక్కువగా చేరడం వలన మానవాళికి హాని జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది పీ మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

స్టూడెంట్స్ కిట్స్ పాయింట్ కేంద్రాల పరిశీలన



దేవరాజుగట్టులో జెడ్పీహెచ్ పాఠశాలను పరిశీలిస్తున్న విద్యాశాఖ అధికారులు

పెద్దారవీడు: సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర స్టూడెంట్స్ కిట్స్ స్టాక్ పాయింట్‌లను ఏర్పాటు చేసేందుకు మండల కేంద్రం పెద్దారవీడు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, దేవరాజుగట్టు గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సమగ్ర శిక్ష రాష్ట్ర అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ రమేష్, జిల్లా సీఎంఓ రూత్‌కుమారి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయానికి లారీలు వచ్చేందుకు రహదారి సక్రమంగా లేనందున దేవరాజుగట్టు గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్టాక్ పాయింట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఎస్ఆర్‌వీఎం స్టూడెంట్ కిట్లు జిల్లాకు రావడం ప్రారంభమయ్యాయని, ఈ సంవత్సరం పాఠశాలలు ప్రారంభించే నాటికే అన్ని పాఠశాలలకు ఎస్ఆర్‌వీఎం స్టూడెంట్స్ కిట్స్ సరఫరా చేసేందుకు రూట్‌మ్యాప్ సిద్ధం చేసినట్లు తెలియజేశారు. వారి వెంట ఎంఈఓ 2 ఎస్‌వీసీహెచ్ సుబ్రహ్మణ్యం, ప్రధానోపాధ్యాయులు ఎస్సీ కృష్ణమోహన్, ఉపాధ్యాయులు ఉన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వాటర్ కూలర్ వితరణ



వాటర్ కూలర్‌ను అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు పూర్వ విద్యార్థులు వాటర్ కూలర్ అందజేశారు. కళాశాలలో సోమవారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1981–82 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు వాటర్ కూలర్ అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మహాలక్ష్మమ్మకు వాటర్ కూలర్‌ను అందజేసిన విద్యార్థులు ఆమెను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రావిక్రింది సత్యనారాయణ, గ్రంధే సుదర్శనం, ఈదర పెద్ద ఆంజనేయులు, నీరూడి కాశయ్య, షేక్ కాశిం, పెరుమాళ్ల సత్యనారాయణ, సుబ్రహ్మణ్యం, మోహన్‌రావు, కటికల చెన్నయ్య, కె. గురవయ్య, సుబ్రహ్మణ్యం, గాదె బ్రహ్మరెడ్డి, బొద్దోజు శ్రీనివాసాచారితో పాటు కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

సాల్ట్ సొసైటీ ఎన్నికలు ఏకగ్రీవం



నాంచార్లరెడ్డికి నివాళులర్పిస్తున్న సొసైటీ సభ్యులు

కొత్తపట్నం: ఉప్పు కొటారు భూములకు సంబంధించిన కొత్తపట్నం సాల్ట్ సొసైటీ ఎన్నికలు సోమవారం ఏకగ్రీవమయ్యాయి. పట్టపు ప్రకాశం అధ్యక్షతన ఉప్పు భూముల్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముందుగా సాల్ట్ సొసైటీ మాజీ అధ్యక్షుడు, దివంగత నేత కోమట్ల నాంచార్లరెడ్డి చిత్రపటానికి ఆయన సతీమణి కోమట్ల భాగ్యలక్ష్మి, సొసైటీ సభ్యులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా నాటారు ఆంజనేయులు, కార్యదర్శిగా పట్టపు సునీల్, డైరెక్టర్లుగా బి.వెంకట్రావు, వి.యానాది, కోమట్ల భాగ్యలక్ష్మి, కోడూరి బ్రహ్మరెడ్డి, తంబి సురేష్, పట్టపు సురేష్, తంబి శ్రీను, తంబి వెంకటసుబ్బారావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ సొసైటీ అభివృద్ధి కోసం ప్రతి రైతూ సహకరించాలన్నారు. రూ.10 లక్షలతో గ్రావెల్ రోడ్డు వేయటానికి ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. మౌలిక వసతులు కల్పించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సొసైటీకి సంబంధించిన ఉప్పు బిల్లును కూడా రన్నింగ్‌లోకి తీసుకురావడం జరుగుతుందన్నారు. ప్రతి రైతు 60 బ్యాగ్‌ల ఉప్పును విరాళంగా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పురిణి వెంకటేశ్వర్లు, పట్టపు ప్రభాకర్‌రావు, పురిణి వెంకట్రావు, పట్టపు భూషణం, రైతులు పాల్గొన్నారు.

ముగిసిన వసంత నవరాత్రులు



అమ్మవారి పట్టు వస్త్రాలను పూర్ణాహుతి చేస్తున్న వేదపండితులు

త్రిపురాంతకం: స్థానిక బాల త్రిపుర సుందరీ దేవి అమ్మవారి ఆలయంలో జరుగుతున్న వసంత నవరాత్రుల ఉత్సవాలు సోమవారం ముగిశాయి. ఉగాది పండుగ సందర్భంగా ప్రారంభమైన ఈ ఉత్సవాలు దశమి వరకు అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేదపండితుడు రాగంపల్లి శాస్త్రి తొమ్మిది రోజులు ఈ వసంతోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆలయాలను దర్శించారు. అనునిత్యం ఉభయదాతలు ప్రత్యేక పూజలు చేశారు. ఆయా కార్యాక్రమాలు సజావుగా జరిగేలా ట్రస్ట్ బోర్డు చైర్మన్ ఇమ్మడిశెట్టి వెంకటసుబ్బారావు, ఆలయాల ఈవో రజని కుమారి పర్యవేక్షించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా భక్తులు అమ్మవారికి సమర్పించిన పట్టువస్త్రాలు, పూజా సామగ్రిలను వేదపండితులు హోమాహుతి చేశారు.